క్లుప్తంగా

అంత్యక్రియలు పూర్తి



నివాళులర్పిస్తున్న కొత్తపల్లి శ్రీనివాస్

కాగజ్‌నగర్‌రూరల్: ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు నానమ్మ అండాలమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా, సోమవారం స్థానిక మోక్షదాంలో అంత్యక్రియలు పూర్తిచేశారు. ఆమె పార్థీవదేహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ దంపతులు నివాళులర్పించారు. నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

28న బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశం

కాగజ్‌నగర్‌రూరల్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఈనెల 28న కాగజ్‌నగర్ పట్టణంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ ఎమ్మెల్సీ, సిర్పూర్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి దండె విఠల్ తెలిపారు. సమావేశానికి నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ మంత్రి జోగు రామన్న హాజరవుతారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమావేశానికి నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆర్‌ఎస్‌పీ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేలకొరిగిన జొన్న పంట

తాంసి: వారం రోజులుగా మండల వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పంటలు దెబ్బతింటున్నాయి. చేతికి వచ్చిన పంటలు నేలకొరగడంతో రైతులు నష్టపోతున్నారు. మండలంలోని గోట్కూరి శివారులో సాగుచేసిన జొన్న నేలకొరిగింది. పెట్టిన పెట్టుబడి కూడా రాలేని పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థలో భవనం

బేల: మండలంలోని సైద్‌పూర్ గ్రామంలోని ఐటీడీఏ జీసీసీ పరిధిలో ఏళ్ల క్రితం నాటి రేషన్ సరుకుల పంపిణీ చేసే డీఆర్ డిపో భవనం శిథిలావస్థకు చేరింది. గోడలకు బీటలు వారాయి. భవనం లోపల సీసీ ఫ్లాట్ పారం కిందికి కుంగింది. భవనం ఎప్పుడు కూలిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, డీఆర్ డిపోకు నూతన భవనం మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వృథాగా విద్యుత్ స్తంభాలు

బేల: మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలోని గణేష్‌పూర్ శివారులో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కోసం వేయాల్సిన విద్యుత్ స్తంభాలు గతేడాది నుంచి వృథాగా ఉన్నాయి. పనులు చేపట్టాలని విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

చలివేంద్రం ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: అఖిల భారత అయ్యప్ప ధర్మప్రచార సభ మంచిర్యాల అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను సభ్యులు సోమవారం ప్రారంభించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారితో పాటు ప్రతీ ఒక్కరి దాహార్తిని తీర్చేందుకు స్థానిక భక్తుల సహకారంతో చల్లని మినరల్ నీటిని చలివేంద్రంలో ఏర్పాట్లు చేసినట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారత అయ్యప్ప ధర్మప్రచార సభ రాష్ట్ర అధ్యక్షుడు తిరుమలరావు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్, సభ్యులు సిరిపురం రాజేశం, నగునూరి శ్రీనివాస్, ఎల్క సంతోశ్ పాల్గొన్నారు.

చైర్మన్‌కు ఆహ్వానం

ఖానాపూర్: పట్టణంలో ఈనెల 26 నుంచి నిర్వహించే ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవానికి రావాలని కోరుతూ గౌడ సంఘం నాయకులు సోమవారం మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యంకు ఆహ్వానపత్రిక అందజేశారు. మంగళవారం నుంచి జరిగే ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు చిన్న నర్సాగౌడ్, బుర్ర రాజారాం, శంకర్‌గౌడ్, కాశారపు మల్లేశ్‌గౌడ్, దుర్గం వెంకాగౌడ్, గణేశ్ తదితరులు ఉన్నారు.

మురుగు నీరు రాకుండా చర్యలు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న బొడ్డోని కుంటలోకి మురుగు నీరు రాకుండా చర్యలు చేపడుతామని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. బొడ్డోని కుంటలోకి మురుగునీరు రావడంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారినపడుతున్నామని కాలనీవాసులు చైర్మన్‌కు విన్నవించారు. సోమవారం చైర్మన్, కమిషనర్ మనోహర్ కుంటను పరిశీలించి మాట్లాడారు. కుంటలో చెత్తాచెదారం వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, కౌన్సిలర్లు, తొంటి శ్రీనివాస్, జన్నారపు శంకర్, పరిమి సురేశ్, షబ్బీర్‌పాషా తదితరులు ఉన్నారు.

హోలీ.. రంగుల కేళి



దహెగాం: ఇట్యాలలో..



ఆసిఫాబాద్‌రూరల్: మోతుగూడలో హోలీ ఆడుతున్న చిన్నారులు



లింగాపూర్‌లో..



సిర్పూర్(టి): హోలీ ఆడుతున్న యువకులు



జైనూర్‌లో..

జిల్లాలో సోమవారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లో ఉదయం పూట నుంచే యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జిల్లాకేంద్రంలో జిల్లా ఉన్నతాధికారులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పలు పాల్గొని ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పట్టణ సీఐ శంకరయ్య బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆసిఫాబాద్: కలెక్టర్‌కు రంగులు పూస్తున్న కాగజ్‌నగర్ ఆర్డీవో సురేశ్



బెజ్జూర్: హోలీ వేడుకల్లో పాల్గొన్న ఎస్సై విక్రమ్



చింతలమానెపల్లి: కర్జెల్లిలో..



కాగజ్‌నగర్‌రూరల్: వేడుకల్లో పాల్గొన్న కోనేరు కోనప్ప



కెరమెరి: నృత్యం చేస్తున్న యువకులు



పెంచికల్‌పేట్‌లో..



కౌటాలలో హోలీ వేడుకలు



ఆసిఫాబాద్: వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



ఆసిఫాబాద్: వేడుకల్లో జెడ్పీటీసీ నాగేశ్వర్ రావు



రెబ్బెన: హోలీ వేడుకల్లో పాల్గొన్న యువకులు



ఆసిఫాబాద్‌అర్బన్: హోలీ వేడుకల్లో పాల్గొన్న ప్రజలు

నర్సరీలకు షేడ్‌నెట్‌లు

- ఎండ తీవ్రతకు ఎండుతున్న మొక్కలు
- సంరక్షించేందుకు అధికారుల అపసోపాలు
- 2లక్షల మొక్కలు పెంచడమే టార్గెట్
- పర్యవేక్షిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు ఎండల తీవ్రతకు దెబ్బతింటున్నాయి. ఎండలు మండి పోతుండడంతో అధికారులు మొక్కల రక్షణకు అనేక పాట్లు పడుతున్నారు. ఎండల నుంచి మొక్కలను రక్షించడానికి షేడ్‌నెట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. రోజురోజుకు ఎండలు మండిపోతుండడంతో మొక్కల రక్షణ అధికారులకు సవాలుగా మారింది. 9వ విడత హరితహారం కార్యక్రమంలో మండలంలోని ఆయా పంచాయతీల్లో రెండు లక్షల మొక్కలను నాటడానికి అధికారులు 12 పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు.

సవాలుగా మొక్కల పెంపకం..

గత వారం రోజులుగా సుమారు 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో నర్సరీల్లో మొక్కల పెంపకం, రక్షణకు ఉపాధిహామీ సిబ్బంది, అధికారులు, వన సేవకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మొక్కల పెంపకంపైన క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సిబ్బందికి సూచనలు చేస్తున్నారు. అధికారుల ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శులు



కొండపల్లి నర్సరీలో ఏర్పాటు చేసిన షేడ్‌నెట్

నర్సరీల్లో ఉన్న మొక్కలను సంరక్షించడానికి షేడ్‌నెట్‌లను ఏర్పాటు చేశారు. నర్సరీలకు ఉదయం, సాయంత్రం నీరు అందిస్తూ రక్షణ చర్యలు చేపడుతున్నారు. మరో రెండు నెలలు నర్సరీల్లో ఉన్న మొక్కలను సంరక్షించడం అధికారులకు సవాలుగా మారింది.

రకరకాల మొక్కలు..

గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాలు, రోడ్డుకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మొక్కలను నాటడానికి అనువైన మొక్కలను పెంచుతున్నారు. టేకు, వేప, చింత, వెదురు, మునుగ, మామిడి, జామ, మందార, గులాబితో పాటు అనేక రకాల పండ్ల మొక్కలు పెంచుతున్నారు.

మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

ఎండలు మండుతున్న నేపథ్యంలో పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను సంరక్షించడానికి ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే నర్సరీలకు షేడ్‌నెట్‌లు ఏర్పాటు చేశాం. నర్సరీలను సందర్శిస్తూ క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధిహామీ సిబ్బందికి సూచనలు చేస్తున్నాం. రానున్న రోజుల్లో నర్సరీల్లో మొక్కల సంరక్షణకు ప్రణాళికలు ఏర్పాటు చేసుకున్నాం. వందశాతం మొక్కలను సంరక్షించడానికి చర్యలు చేపడుతాం.

– గంగాసింగ్, ఎంపీవో, పెంచికల్‌పేట్

గుణపాఠం నేర్చుకోవాల్సిందే..!



తాటిపల్లి వద్ద వాగులో మునిగి యువకులు మృతిచెందడంతో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- సరదాల పేరుతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న యువకులు
- తల్లిదండ్రుల వేదనకు కారణమవుతున్న తీరు

చింతలమానెపల్లి/కౌటాల: సరదా.. సంతోషం ఏదైనా శృతి మించకూడదు. వేడుకల పేరిట యువత తీరు ప్రమాదాలకు కారణంగా నిలుస్తోంది. కౌటాల మండలం తాటిపల్లి వద్ద యువకులు మృత్యువాత పడిన తీరు చర్చనీయాశంగా మారింది. యువతతో పాటు తల్లిదండ్రులు సైతం గుణపాఠం నేర్చుకోవాలని ఈ ఘటన తెలియజేస్తుంది.

వేడుకలు.. యువత జోరు..

ఒకప్పుడు వేడుకలంటే కుటుంబమంతా కలిసి ఒక్కచోట చేరి సరదాగా గడిపేవారు. ఆప్తులు, బంధుమిత్రుల మధ్య గడిపే సందర్భాలు మానసికంగా, ఆరోగ్యంగా ఉండేవి. వీటి వల్ల కుటుంబ సంబంధాలు మెరుగుపడేవి. కుటుంబ సభ్యుల అవసరాలు తెలుసుకునే అవకాశం ఉండేది. కానీ ప్రస్తుతం వేడుక అంటే యువత మాత్రమే జరుపుకునేదిగా అర్థం మారిపోయింది. మద్యం, మాంసంతో విందులు, విపరీతమైన శబ్ధ కాలుష్యంతో నిండిపోయింది.

ప్రమాదాలకు కారణమవుతున్న తీరు..

మితిమీరిన ఉత్సాహం.. నిర్లక్ష్యపు ధోరణి యువత పాలిట పెను ప్రమాదంగా మారింది. గత కొంత కాలంగా యువత వేడుకల పేరిట ప్రమాదాల బారిన పడుతోంది. వాహనాల్లో వేగంగా వెళ్లి ప్రముఖుల కుమారులు సైతం మృత్యువాత పడిన ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కలిగించాయి. మద్యం మత్తులో చేస్తున్న నేరాలు, జరుగుతున్న ప్రమాదాలు తల్లిదండ్రులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మితి మీరిన ధోరణి కీడు చేస్తున్నా యువత మేలుకోవడం లేదనే ఆందోళన వ్యక్తమవుతోంది.

నిర్లక్ష్యంగా యువత..

గతంలో చింతలమానెపల్లి మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన ఇంటర్ చదువుకుంటున్న యువకులు ముగ్గురు అతి వేగంగా మోటర్ సైకిల్‌పై ప్రయాణిస్తూ సిర్పూర్(టి) మండలం అటవీ ప్రాంతంలో ప్రమాదానికి గురయ్యారు. ఈఘటనలో ఒక యువకుడు చనిపోగా మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. తాజాగా కౌటాల మండలం తాటిపల్లి వద్ద నలుగురు యువకులు నిర్లక్ష్యంతో నదిలో స్నానానికి వెళ్లి మృత్యువాత పడ్డారు. తరచూ జరుగుతున్న ఘటనలు యువత తీరు మారాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి.

విషాదాల బారిన పడొద్దు



సరదాలు, సంతోషాల పేరిట ప్రమాదాలకు గురికావడం విషాదం కలిగిస్తుంది. ప్రాణాలు కోల్పోవడం లేదా గాయాలపాలవడం వల్ల తీవ్ర నష్టం జరుగుతుంది. యువత బాధ్యతగా ఉండాలి. వేడుకల పేరుతో ప్రమాదాల బారిన పడొద్దు. – సాదిక్‌పాషా, సీఐ, కౌటాల

ఉత్సాహంగా 'దురాడి' సంబురం



సహపంక్తి భోజనం చేస్తున్న ఆదివాసీలు

కెరమెరి: హోలీ పర్వదినంలో భాగంగా మొదటి రోజు పులారా కార్యక్రమాన్ని నిర్వహించిన ఆదివాసీలు, రెండోరోజు సోమవారం ఆదివాసీ గూడేల్లో రంగోత్సవం, దురాడి అత్యంత ఘనంగా జరుపుకున్నారు. సోమవారం రాత్రి కాముని దహనం చేసిన చోటే రాత్రంతా జాగరణ చేశారు. ఆటలు ఆడారు, పాటలు పాడారు. 'మాతారి.. మాతరల్'లను కామ దహనం చేసిన బూడిదను ఇతరులు దొంగలించకుండా ఉండడానికి ప్రత్యేకంగా జాగారం చేశారు. కాముడి దహనం వద్ద గుడాలను నైవేద్యంగా సమర్పించారు. అక్కడే వాటిని అరగించాక కాముడి బూడిదను తీసుకెళ్లి తమ ఇళ్ల ముఖద్వారం ఎదుట చల్లారు. దురాడిలో భాగంగా



పల్లెల్లో బోజర అడుగుతున్న గిరిజనులు

డోలు వాయిస్తూ 'జాజిరి.. జాజిరి.. జాజిరేయ్' అంటు ప్రతీ ఇంటికి తిరుగుతూ బోజర (ధర్మం) అడిగారు. దీంతో పల్లెలు డోలు వాయిద్యాలతో మారుమోగాయి.

నేడు సామూహిక వివాహాలు

ఇంద్రవెల్లి: మండలంలోని దస్నాపూర్ గ్రామంలో మంగళవారం శ్రీశ్రీ సంత్ సద్గురు పూలాజీ బాబా ధ్యాన్ మందిరంలో అంద్ ఆదివాసీ సేవ సంఘం ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖడే విష్ణు సోమవారం విలేకరులకు తెలిపారు. సామూహిక వివాహ వేడుకలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరు కానునట్లు పేర్కొన్నారు. బంధువులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై నూతన వధువరులను ఆశీర్వదించాలని కోరారు.

ఘనంగా అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణ శివారులోని ఆదిలాబాద్ రూరల్ మండలంలో గల బేల్లూరి అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలను మూర్తి గురు స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా గణపతి హోమం, అయ్యప్ప స్వామికి నవకల్ప అభిషేకం, మహా హారతి, అన్నదానం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూర్యకాంత్, రవి, భక్తులు పాల్గొన్నారు.

ఆవు అందజేత

కుంటాల: కుంటాల మహాదేవుడి ఆలయానికి సోమవారం నర్సాపూర్(జి) మండలంలోని తురాటి వీడీసీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆవును అందజేశారు. కోరికలు నెరవేరడంతో ఆలయానికి గ్రామస్తులు ఆవును విరాళంగా అందించినట్లు పూజారి జంగం మధు తెలిపారు.